పుట్టగొడుగు.. బహు బాగు!





హుకుంపేట మండలం భీరం గ్రామంలో కొండపై విరిసిన పుట్టగొడుగులు అందంగా ఆకట్టుకుంటున్నాయి. పచ్చని మొక్కల మధ్య తెలుపు రంగులో వివిధ ఆకృతుల్లో విరిసి అబ్బురపరుస్తున్నాయి. మన్యంలోని కొండ ప్రాంతంలో ఎండిపోయిన చెట్లకు కాసే పుట్టగొడుగులను ఎదురుకొక్కులు అని పిలుస్తుంటారు. వీటికి మంచి గిరాకీ ఉంది. వీటితో వండిన కూర ఎంతో రుచికరంగా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు.

– హుకుంపేట, న్యూస్‌టుడే

రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలికలకు పతకాలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నానికి చెందిన బాలికలు రాష్ట్ర స్థాయి ఆట్యాపాట్యా పోటీల్లో పతకాలు సాధించారు. నెల్లూరులో ఆట్యాపాట్యా సంఘం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ఈ పోటీలు జరిగాయి. తొమ్మిదో సబ్ జూనియర్స్ విభాగంలో బాలికల జట్టు ద్వితీయ స్థానంలో, బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలను సంఘ కార్యదర్శి గోపీకృష్ణ, విద్యాంజలి పాఠశాల ఛైర్మన్ అక్షజ్‌కృష్ణ, కరస్పాండెంట్ శాంతి, పీఈటీ అప్పారావు అభినందించారు.



రాకపోకలకు మళ్లీ యాతన

ధారకొండ పంచాయతీలోని గంగవరం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక కల్వర్టు ఆదివారం మధ్యాహ్నం కొట్టుకుపోయింది. గత నెల 8న ఈ ప్రాంతంలో సంభవించిన తుపానుకు గంగవరం వద్ద వంతెన పాడైంది. ఈ ప్రాంతీయులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు నిలిచిపోయాయి. ఇక్కడ రాకపోకలకు వీలుగా కల్వర్టు నిర్మించాలని ఈ ప్రాంతీయులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో తాత్కాలిక కల్వర్టు ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షాలకు ఇది కూడా కొట్టుకుపోయింది. గంగవరం అవతల ఉన్న గ్రామాలకు రాకపోకలు మళ్లీ నిలిచిపోయాయి. – సీలేరు, న్యూస్‌టుడే

విద్యాశాఖ ఏడీపై అట్రాసిటీ కేసు

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన మహిళను కించపరిచిన జిల్లా విద్యాశాఖ ఏడీ వినయ్ మోహన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈయనపై గిరిజన మహిళ సుజాత సాల్మన్ పాడేరు సీఐ దీనబంధుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈనెల 3వ తేదీన జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి వెళ్లిన తనను, భర్త తెల్లగంజి దేవదాసును అవమానించారని పేర్కొన్నారు. ఈ దృశ్యాలు సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా దాడి చేశారన్నారు. ఈ మేరకు ఏడీతోపాటు జూనియర్ అసిస్టెంట్ వినీల్, వీరబాబులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇన్నాళ్ల కల.. సాకారమవుతుందిలా!

విలీన మండలాల్లో ఇళ్ల నిర్మాణానికి అడుగులు

న్యూస్‌టుడే, కూనవరం

విలీన మండలాల్లో పేదల సొంతింటి కల నెరవేరే అవకాశం వచ్చింది. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది ఇక్కడి పేదల పరిస్థితి. కేంద్రం, రాష్ట్రం పక్కా గృహాలను మంజూరు చేసినా వాటిని లబ్ధిదారులకు అందించడంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఫలితంగా లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయన్న సంతోషం లేకుండాపోయింది. అయిదేళ్లుగా సొంతింటి కల పునాదుల్లోనే మగ్గిపోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఇప్పటివరకు జరిగిన నిర్మాణాలకు ఇవ్వాల్సిన బకాయిలను విడుదల చేయడంతోపాటు మార్చి నెలాఖరు నాటికి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న అన్ని గృహాలను పూర్తి చేసేలా ఆదేశాలిచ్చింది. ఈ మేరకు అధికారులు అసంపూర్తి గృహ నిర్మాణాలను పరిశీలించి వాటిని పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టారు.



వరరామచంద్రాపురం మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇంటి లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ

రాష్ట్ర విభజన తరవాత కూనవరం, వరరామచంద్రాపురం, ఎటపాక, చింతూరు మండలాల లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకాల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2017లో పక్కా గృహాలు మంజూరు చేశాయి. లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా సాంకేతిక సమస్యలతో విలీన మండలాల్లో పనులు మొదలు కాలేదు. ఆ సమస్యను దాటి 2018 చివరలో పనులు మొదలు పెట్టారు. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం గృహ నిర్మాణాలపై తీవ్ర నిర్లక్ష్యం చూపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన ఇళ్లకు నిధులు విడుదల చేయకుండా ఆపేసింది. దీంతో పనులు నిలిచిపోయాయి. వందల సంఖ్యలో ఇళ్లు మంజూరైనా ఐదేళ్లలో పూర్తయినవి పదుల సంఖ్యలో ఉండటం పరిస్థితికి అద్దం పడుతోంది.



కూనవరం మండలం బోదునూరులో ఆగిన ఇంటి కొలతలు తీస్తున్న ఏఈ

✦ ప్రస్తుతం పాలనాపగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు రానున్న ఆరు నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేసింది. దీంతో అధికారులు గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులను కలిసి పరిస్థితులు వివరించి ఆగిపోయిన పనులు మళ్లీ మొదలు పెట్టిస్తున్నారు. గత బకాయిలను విడుదల చేసి పనుల్లో వేగం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

✦ కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి 90 రోజులకు హామీ ఉపాధి పనిదినాల వేతనాలు సాయంగా అందిస్తుంది. అప్పట్లో ఇందుకు రోజుకు రూ. 200 చొప్పున ఇస్తే ప్రస్తుతం అదే 90 రోజులకు రోజుకు రూ. 300 చొప్పున ఇస్తున్నారు. సానుకూల పరిస్థితులు నెలకొనడంతో పక్కా గృహాల నిర్మాణాల్లో వేగం పుంజుకుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పనులు చేస్తూ దినసరి నివేదికలను ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు.

✦ కేంద్ర ప్రభుత్వం కొత్తగా పీఎం జన్‌మన్ పథకం తీసుకురావడంతో మన్యంలోని కొండరెడ్డి కుటుంబాలకు ప్రత్యేకంగా లబ్ధి చేకూరనుంది. దీనిలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరానికి కూనవరం మండలంలో 135, చింతూరులో 143, వరరామచంద్రాపురంలో 59 మంది కొండరెడ్డి కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరయ్యాయి.

	రాష్ట్రం మంజూరు చేసిన గృహాలు (2016-21)			కేంద్రం గృహాలు (2016-22)		
మండలం	మంజూరు	నిర్మాణంలో..	పూర్తి	మంజూరు	నిర్మాణంలో..	పూర్తి
కూనవరం	148	111	37	247	223	24
ఎటపాక	366	342	24	506	354	152
చింతూరు	379	345	34	653	557	96
వరరామచంద్రాపురం	157	156	01	167	141	26

సెంచరీ కొట్టిన టమాటా

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: కిలో టమాటా ఏకంగా రూ.100కి చేరింది. ఆదివారం పెదబొడ్డేపల్లి రైతుబజారులో వ్యాపారులు ఈ ధరకు వీటిని విక్రయించారు. టమాటాలు కూడా చిన్న సైజువే కావడం గమనార్హం. భారీ వర్షాలు, తెగుళ్ల కారణంగా చిత్తూరు సమీపంలోని మదనపల్లె ప్రాంతంలో దిగుబడులు తగ్గడమే ధర పెరగడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. గత వారం కిలో రూ. 50కే అమ్మేవారు. క్రమేపీ రూ. 70, రూ. 80 చొప్పున పెరుగుతూ శనివారం నుంచి వందకు ఎగబాకింది. డిసెంబరు నుంచి నర్సీపట్నం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ పంట దిగుబడి వస్తుందని, అప్పటికీ ధరలు తగ్గుతాయని చెబుతున్నారు. రావులపాలెం నుంచి వచ్చే దొండకాయలు గతంలో కేజీ రూ. 20కి అమ్మేవారు. ఇప్పుడు రూ. 60కి పెరిగింది. బీరకాయలు కిలో రూ. 70కి తగ్గడం లేదు. హైబ్రిడ్ మునగకాడ రూ. 20 చెబుతున్నారు. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పచ్చిమిర్చి ధరలు నిలకడగా ఉన్నాయి.



రైతుబజార్‌కు వ్యాపారులు తెచ్చిన నాసిరకం టమాటా

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు

జిల్లాకు రూ 3.75 కోట్లు మంజూరు



జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు: 3214

మరుగుదొడ్లు మంజూరైనవి: 649

తాగునీటి సౌకర్యం మంజూరైన కేంద్రాలు: 829

కేటాయించిన నిధులు: రూ 2.34 కోట్లు

కేటాయించిన మొత్తం: రూ 1.41 కోట్లు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే

గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది.. కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, ఇతర లబ్ధిదారులు అసౌకర్యాల నడుమ బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. అత్యవసర అవసర సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు సైతం తీవ్ర ఇబ్బందులు పడేవారు. రక్షిత తాగునీరు అందుబాటులో ఉండేదికాదు. జిల్లాలో చాలా కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నా అయిదేళ్లలో సౌకర్యాలు కల్పించాలన్న విషయాన్ని గత ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టింది. సొంత భవనాలు ఉన్న చోట్ల అవసరమైన కనీస వసతులు కల్పించనున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పనకు సంబంధించిన పనుల నిర్వహణ బాధ్యతలు జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగానికి అప్పగించారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ 36 వేలు, ఒక్కో ఆర్వో ప్లాంటుకు రూ 17 వేల చొప్పున ఖర్చు చేయనున్నారు.

శరవేగంగా పూర్తి చేయిస్తాం..



జిల్లాలో సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతిచ్చాం. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించి పనులు చేస్తున్న అధికారులతో సమన్వయం చేసుకుని శరవేగంగా చేయించడానికి చర్యలు తీసుకుంటాం. – ఎన్.సాయి సూర్యలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్

1478 కేంద్రాల్లో..

జిల్లాలో సదుపాయాలు కల్పించాల్సిన కేంద్రాలు ఎన్ని ఉన్నాయో గుర్తించారు. ఆ మేరకు 649 కేంద్రాల్లో మరుగుదొడ్లు, 829 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు దాదాపు రూ 3.75 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసింది. కొన్ని మండలాల్లో ఎక్కువ పనులు మంజూరు చేశారు. పనుల పర్యవేక్షణ బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగించారు. వీలైనంత వేగంగా పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు జిల్లా అధికారులు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు.

సరిహద్దులో సినీ తారాగణం

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని మాచ్‌ఖండ్‌లో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. క్రిష్ దర్శకత్వంలో 'ఘాటీ' సినిమా చిత్రీకరణ ఇక్కడ జరుగుతోంది. ఆదివారం ప్రముఖ కథానాయిక అనుష్కశపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. వించ్‌హౌస్‌లో కొన్ని సన్నివేశాలు షూట్ చేశారు. పోలీస్ అధికారిగా జగపతిబాబు, కథానాయిక అనుష్క, విలన్ నాని తదితరులపై సన్నివేశాలు చిత్రీకరించారు. విద్యుత్కేంద్రం వద్ద నృత్యదర్శకుడు, నటుడు రాజు సుందరం, జగపతిబాబులతో షూటింగ్ చేశారు. అనుష్కను చూడటానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీగా వచ్చారు. షూటింగ్ బృందం కనీసం దూరం నుంచి కూడా ఆమెను చూసేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.



వించ్‌లో జగపతిబాబు, రాజు సుందరం తదితరులు

మోతుగూడెంలో..



మోతుగూడెంలో నాజర్

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం మోతుగూడెం పర్యటక ప్రాంతాల్లో షూటింగ్‌లతో సందడి నెలకొంది. ఉభయ రాష్ట్రాల నలుమూలల నుంచి వచ్చిన కెమెరామెన్లు 15 రోజులుగా సీలేరు నది పొడవునా, పొల్లూరు ఎగువ జలపాతం వద్ద వెబ్ సిరీస్, వెడ్డింగ్ షూట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఓ వెబ్ సిరీస్ యూనిట్ బృందం పది రోజులుగా కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తోంది. ఇందులో నటించేందుకు వచ్చిన సీనియర్ నటుడు నాజర్ వారపు సంతలో, రెస్టారెంట్లో తిరుగుతూ సందడి చేస్తున్నారు. మోతుగూడెంలోని పలువురు యువతీ, యువకులు ఆయనతో ఫొటోలు తీసుకున్నారు. 200 మందితో నాజర్ బృందం పది రోజుల క్రితం వచ్చి మోతుగూడెం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంటలో ఉంటూ పలు సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.

మన్యానికే మణిహారం

దసరా నుంచి పాడేరు వైద్య కళాశాలలో తరగతులు

50 ఎంబీబీఎస్ సీట్లకు తొలి ఏడాది అనుమతి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

మన్యానికే మణిహారమైన పాడేరు వైద్య కళాశాల దసరా నుంచి ప్రారంభం కానుంది. జిల్లావాసులకు వైద్యసేవలు మరింత చేరువ కానున్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఈ కళాశాలలో 50 ఎంబీబీఎస్ సీట్లకు కేంద్ర వైద్య మండలి అనుమతిచ్చిన సంగతి తెలిసిందే. డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఈ ఏడాది నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఇప్పటికే ఈ కళాశాలలో 38 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. అడవి బిడ్డలకు ఆరోగ్య సేవలు మరింత చేరువ కానుండటంతో గిరిజనులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పనులు వేగవంతం... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సుమారు రూ.500 కోట్లతో ప్రారంభించిన వైద్య కళాశాల నిర్మాణ పనులు గత వైకాపా పాలనలో నెమ్మదిగా సాగాయి. 2024 ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఈ పనులు చేపట్టింది. 2024-25 విద్యా సంవత్సరానికి వైద్య కళాశాల ప్రారంభమయ్యేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ చూపారు. ఈనెల 14వ తేదీ నాటికి మిగిలిన 12 సీట్లు భర్తీ కానున్నట్లు అధికారులు తెలిపారు.

✦ తరగతులు నిర్వహించేందుకు అవసరమైన హిస్టారికల్ ప్రయోగశాల, మ్యూజియం, అనాటమీ, హెమథాలజీ, బయోకెమిస్ట్రీ ప్రయోగశాలలు, లెక్చరర్ గ్యాలరీ, వసతిగృహం, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలు పూర్తిస్థాయిలో సమకూరనున్నాయి.



నిర్మాణ దశలో పాడేరు వైద్య కళాశాల

అంతా సిద్ధం: వైద్య కళాశాలలో తరగతుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. ఇప్పటికే 38 సీట్లు భర్తీ అయ్యాయి. 50 మంది విద్యార్థులకు సంబంధించి వసతి, భోజనశాలలతోపాటు తరగతి గదుల నిర్మాణం దాదాపుగా పూర్తయింది. మిగిలిన పనులు పూర్తి చేసి అన్ని హంగులు కల్పిస్తాం.

– డాక్టర్ హేమలత, ప్రిన్సిపల్, పాడేరు వైద్య కళాశాల

మోదకొండమ్మ సన్నిధిలో కలెక్టర్ దంపతులు

పాడేరు, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ అమ్మవారిని ఆదివారం కలెక్టర్ దినేష్‌కుమార్, ఆయన సతీమణి, అనకాపల్లి కలెక్టర్ విజయ్‌కృష్ణన్, పిల్లలు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు కలెక్టర్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు తరలివచ్చారు. వస్త్ర వ్యాపారి త్రినాథ్ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.



కలెక్టర్లు దినేష్‌కుమార్, విజయ్‌కృష్ణన్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న కోటిబాబునాయుడు తదితరులు

తాతయ్యబాబు ప్రమాణ స్వీకారం 10న

బుచ్చెయ్యపేట: ఏపీ గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన బత్తుల తాతయ్యబాబు ఈ నెల 10న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, కూటమి నేతలను ఆదివారం కలిసి ఆహ్వానాలు అందజేశారు.

పర్యటక రంగానికి పూర్వ వైభవం తెస్తాం

■ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం
■ మంత్రి కందుల దుర్గేశ్

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతోపాటు అద్భుతమైన ప్రకృతి సౌందర్యానికి నిలయమని రాష్ట్ర పర్యటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ కొనియాడారు. పర్యటక రంగానికి పూర్వ వైభవం తెస్తామన్నారు. ఆదివారం అనంతగిరి మండలంలో ఆయన పర్యటించారు. ముందుగా తైడా జంగిల్ బెల్స్‌కు చేరుకున్నారు. కూటమి నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న కాటేజీలు పరిశీలించారు. తైడా జంగిల్‌బెల్స్‌లో నిర్మాణంలో ఉన్న నూతన కాటేజీలు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో పర్యటక అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. అప్పటి పర్యటక శాఖ మంత్రి రోజా.. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను విమర్శించడంపై పెట్టిన శ్రద్ధ పర్యటక రంగం అభివృద్ధిపై పెట్టి ఉంటే బాగుండేదన్నారు. ఇక్కడి రిసార్టులు ఐదేళ్ల నిర్లక్ష్య పాలనకు సాక్ష్యంగా నిలిచాయని చెప్పారు.



బొర్రాగుహలను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేశ్, దొన్నుదొర తదితరులు

బొర్రా గుహల అభివృద్ధికి రూ. 30 కోట్లు

అక్కడి నుంచి బొర్రాగుహలకు వెళ్లారు. ఇక్కడ కల్పించాల్సిన వసతులపై పర్యటక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెట్లు మార్గం వెడల్పు పెంచాలని, అన్ని రకాలైన వసతులు కల్పించాలన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో చర్చించి అటవీశాఖ అధికారులను సమన్వయం చేసుకుని సందర్శక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. బొర్రాగుహల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0లో రూ. 30 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పర్యటక శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను సీఎం చంద్రబాబునాయుడితో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాశీపట్నం వద్ద సుమారు 500 సంవత్సరాల వయసున్న టెంపుల్‌ట్రీ ఉందని, దానిని పర్యటకంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి దొన్నుదొర, జనసేన అరకు పార్లమెంటరీ అధ్యక్షులు వంపూరి గంగులయ్య, తెదేపా మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, జనసేన నాయకులు చిరంజీవి, మురళీ, బాబి పాల్గొన్నారు.



మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న జనసేన నాయకులు

అయిదు దశాబ్దాల తరవాత ఆనందంగా..


డ్యాన్స్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974-75లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత ఒకచోట కలిశారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో జరిగింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వయస్సును మరిచి అంతా సరదాగా నృత్యాలు చేశారు. కష్ట, సుఖాలను పంచుకున్నారు. అంత్యాక్షరి ఆడుతూ సరదాగా గడిపారు. ఒకపై ఏటా కలవాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి సామూహిక భోజనాలను చేశారు. ఆనాడు తమకు చదువు చెప్పిన కొంతమంది గురువులను సత్కరించారు.

పరిచయం ముందు.. ఆపై మత్తుమందు!!

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో హనీట్రాప్ బాధితులు చాలా మంది ఉన్నట్లు గుర్తించామని.. వీరంతా ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. ఇప్పటికే విశాఖ నగరంలో రెండు హనీట్రాప్ కేసులు నమోదయ్యాయని, ఇందులో ప్రధాన నిందితుల ఆధారాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నగర పోలీసు కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. యువకులను ముగ్గులో దింపి ఆపై డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న యువతిపై తొలుత భీమిలి స్టేషన్‌లో కేసు నమోదైన నేపథ్యంలో మరో బాధితుడు ముందుకొచ్చి కంచరపాలెం స్టేషన్‌లో అదే నిందితురాలిపై ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా డబ్బున్న వారిని లక్ష్యంగా చేసుకుని వల వేయటం జరుగుతోందని.. ఇదంతా ఓ ముఠా పథకం ప్రకారమే చేయిస్తోందని వెల్లడించారు. అరెస్టయిన నిందితురాలికి ఆ ముఠానే శిక్షణ ఇచ్చి రంగంలోకి దించిందన్నారు. ఇన్‌స్టా, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా డిజిటల్ మార్కెటింగ్ పేరిట పరిచయాలు ఏర్పరచుకుని, ఆ తర్వాత బాధితులకు మత్తు మందు ఇచ్చి తమ ఆధీనంలోకి తెచ్చుకుంటారన్నారు. అలాగే పలు ఫొటోలు, వీడియోలను చిత్రీకరించి.. బ్లాక్‌మెయిల్‌కు పాల్పడతారని, కుటుంబ సభ్యులను కూడా బెదిరించి అందినంత దోచుకుంటారన్నారు.



సమావేశంలో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

☛ నగరంలోకి గంజాయి ఏ రూపంలో వచ్చినా గుర్తించేందుకు తగిన కిట్లు త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు, సిబ్బందితో సిటీ పోలీసు సిబ్బందికి శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు.

అనకాపల్లి/ పట్టణం న్యూస్‌టుడే

చెత్త సేకరణకు వసూలు చేస్తున్న పన్నును కూటమి ప్రభుత్వం రద్దు చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అనకాపల్లి పట్టణ ప్రజలకు ఏడాదికి రూ. 3.67 కోట్ల భారం తప్పనుంది.

చెత్తపన్నుకు చెల్లు..

పట్టణవాసులకు తగ్గిన భారం రూ.3.67 కోట్లు

ఇంటికి రూ.120 చెత్తపన్ను వసూలు చేయాలని మూడేళ్ల క్రితం అప్పటి వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఇంటి పన్నులు భారీగా పెంచిన పరిస్థితుల్లో ఈ చెత్త పన్ను ఏమిటని అధికారులను నిలదీసేవారు. అధికారులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ప్రజల నుంచి స్పందన వచ్చేది కాదు. ఉన్నతాధికారులు సిబ్బందిపై ఒత్తిడి తెచ్చేవారు. ప్రభుత్వ పథకాలు నిలిపి వేస్తామని కొంత మంది వాలంటీర్లు, సచివాలయం కార్యదర్శులు భయపించి వసూలు చేసేవారు. పన్ను చెల్లించకపోతే చెత్త సేకరించమని చెప్పి మరి కొందరు వద్ద వసూలు చేసేవారు.

జోన్ పరిధిలో 28,135 ఇళ్లు ఉన్నాయి. మురుగువాడలలో ఉన్నవి 9,519 ఇళ్లు. వాణిజ్య భవనాలు 1,410 కాగా అపార్టుమెంట్లలోని ఫ్లాట్లు 788. మిగిలిన 16,418 సాధారణ ఇళ్లు. మురికివాడల్లో ఇళ్లకు నెలకు రూ. 60. మిగిలిన ఇళ్లకు రూ.120 వసూలు చేసేవారు. సకాలంలో చెల్లించకపోతే నెలకు రూ.15 అపరాధ రుసుం వసూలు చేసేవారు. వాణిజ్య విభాగాలు చెల్లించకపోతే అపరాధ రుసం రూ.100 చెల్లించాల్సి వచ్చేది. వాణిజ్య విభాగంలోని భవనాలకు వ్యాపారాన్ని బట్టి నెలకు రూ.300 వరకు వసూలు చేసేవారు. ఇలా మొత్తం ఏడాదికి రూ. 3.67 కోట్లు ప్రజల నుంచి చెత్త పన్ను పేరుతో రాబట్టేవారు.

ఎన్నికల సమయంలోనే చెత్త పన్ను రద్దు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. తాజాగా గాంధీ జయంతి రోజున ముఖ్యమంత్రి దీన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


చెత్త తీసుకెళ్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

హామీ అమలు



పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడం, వీధిదీపాలు వెలిగించడం వంటి పనులు చేయాలి. దీనికోసం ఇంటి పన్నులు చెల్లిస్తున్నాం. గత ప్రభుత్వం ప్రత్యేకంగా చెత్త పన్ను వసూలు చేసేది. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో చెత్త పన్ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి రద్దు చేశారు.

– మళ్ల గౌరి, గృహిణి, గవరపాలెం


మంచి నిర్ణయం



వైకాపా ప్రభుత్వం ఇంటి పన్నులు పెంచేసింది. చెత్తకు పన్ను వసూలు చేసేవారు. చెత్తను తాము రహదారులపై వేయడం లేదు. వాహనం వచ్చినప్పుడు అందులో వేస్తున్నాం. ఏటా రూ. 720 చెల్లించాలంటే డబ్బు ఎక్కడ నుంచి తేవాలి. కూటమి నాయకులు అధికారంలోకి వస్తే చెత్త పన్ను ఉండదని చెప్పి అన్నట్లే రద్దు చేశారు.

– గొర్లి ప్రజ్ఞ, భీమునిగుమ్మం

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నం గురుకుల పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి సీహెచ్ కిరణ్ కుస్తీ పోటీల్లో రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకున్నాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన విజయవాడలో నిర్వహించిన అండర్-14 విభాగం కింద 58 కిలోల కేటగిరిలోని రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో కిరణ్ పాల్గొన్నాడు. మూడో స్థానంతో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, పీఈటీ వినోద్ ప్రత్యేకంగా అభినందించారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో..

అచ్యుతాపురం: సౌత్‌జోన్-1 హ్యాండ్ బాల్ పోటీల్లో అచ్యుతాపురం మండలం మార్టూరుకు చెందిన గట్టి మురళీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 27 నుంచి ఈనెల 1 వరకు హైదరాబాద్‌లో ఈ పోటీలు జరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈపోటీలకు హాజరయ్యారు. పాయకరావుపేట శ్రీప్రకాశ్ విద్యా నికేతన్ తరపున అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న మురళీ ప్రతిభ చూపడంతో జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 7 నుంచి ఉత్తరప్రదేశ్‌లో జాతీయ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పలువురు ఇతనిని అభినందించారు.



పేరులో వింత!


– న్యూస్‌టుడే, అచ్యుతాపురం

పూడిమడక మత్స్యకారులకు అరుదైన చేప చిక్కింది. మత్స్యకారులు నత్తి చేపగా దీనిని పిలిస్తారు. ఈ గ్రామానికి చెందిన మత్స్యకారుడు దీనిని రూ.1600 కొనుగోలు చేశాడు.

కేజీహెచ్ సుభోజనం సేవల విస్తరణ


భవనం లోపల భోజనాల కోసం చేసిన ఏర్పాట్లు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో 11 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సుభోజనం సేవలను ప్రస్తుతం విస్తరిస్తున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ ఛారిటీస్ సంయుక్తంగా కేజీహెచ్‌కు వచ్చే రోగుల సహాయకులకు రూ.10లకే రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నాయి. ఇంతకాలం భోజనం చేసే వారికి ఎటువంటి వసతులు లేవు. ఎండైనా, వానైనా ఆరుబయటే భోజనాలు చేసేవారు. ఇక నుంచి ఆయా ఇబ్బందులు తొలగనున్నాయి. ఎముకుల వార్డు సమీపంలోని కేజీహెచ్ సమకూర్చిన స్థలంలో హరేకృష్ణ సంస్థ భవనాన్ని నిర్మించింది. ఒకేసారి 150 మంది భోజనం చేసే విధంగా ఆ భవనంలో వసతులు కల్పించింది. చేతులు కడుక్కోవడానికి, తాగునీటి కోసం వేర్వేరుగా వసతి కల్పించారు. ఈనెల 7న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కమిషనర్ సంపత్‌కుమార్, జేసీ మయూర్ అశోక్ భవనాన్ని ప్రారంభించనున్నారు.

ఐక్యంగా కదిలే.. గొంతెత్తి నినదించే..!

ఉక్కునగరం, న్యూస్‌టుడే: విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ మానవహారం నిర్వహించారు. విశాఖ శివారు అగనంపూడి నుంచి గాజువాక వరకు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన మానవహారంలో ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు పాల్గొని చేయి చేయి కలిపారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధించేలా చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నినదించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు శిబిరంలో మాట్లాడారు. కర్మాగారాన్ని పరిరక్షిస్తామని కేంద్రం చెబుతున్నా... ఒప్పంద కార్మికుల తొలగింపు, శాశ్వత కార్మికుల ఇంటి అద్దె కోత, సకాలంలో వేతనాల చెల్లింపు లేకపోవడం.. కార్మికులను భయాందోళనకు గురి చేస్తున్నాయన్నారు.


శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, చిత్రంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నీళ్లకు నిలకడ మంత్రం

- జలసిరిని ఒడిసిపడితేనే ఫలితం
- నీటి సంక్షోభం నుంచి నగరానికి విముక్తి
- ఏపీఫెర్వాస్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణం

ఈనాడు, విశాఖపట్నం

వేసవి వస్తే...కొన్ని ప్రాంతాల్లో తాగునీరు అందక ఇబ్బందులు. వర్షాకాలంలో కాలువలు, గెడ్డల ద్వారా సముద్రంలో వృథాగా కలిసే వాన నీరు. - ఏటా విశాఖలోని కొన్ని కాలనీల్లో కనిపించే దృశ్యాలివే.

రోజుకు మనిషికి అవసరమైన నీరు: 135 లీటర్లు

జీవీఎంసీ పరిధిలో సరఫరా: 95 లీటర్లు

120 మిలియన్ గ్యాలన్లు (ఎంజీడీ) తాగునీరు, పరిశ్రమలకు అవసరం

ప్రస్తుతం సరఫరా: 85(ఎంజీడీ)

దీనికి కాలనీల స్థాయి నుంచే పరిష్కారం వెతకాలని ఆంధ్రప్రదేశ్ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య(ఏపీఫెర్వాస్) ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్నారు. ఇంకుడు గుంతలు తవ్వించి జల సంరక్షణకు కృషి చేస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుంటే భవిష్యత్తులో నీటి కొరతను కొంతైనా అధిగమించొచ్చు.


శ్రీనూకాంబిక కాలనీలో ఇంకుడు గుంత

విశ్రాంత ఉద్యోగులే అధికం..: నగరంలో జేఆర్ నగర్ కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదేళ్ల క్రితం 15 ఇంకుడు గుంతలు తవ్వారు. ప్రతి అపార్ట్‌మెంట్, ఇల్లు, పార్కు, ఖాళీ స్థలాల్లో సరైన స్థలం ఎంపిక చేసుకుని వీటిని నిర్మించారు. ఫలితంగా ఏడాదికి సుమారు 7,45,000 లీటర్ల నీటిని ఆదా చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న ఏపీఫెర్వాస్‌లో అధిక శాతం విశ్రాంత ఉద్యోగులే. సమాఖ్య అధ్యక్షుడు ఉదయ్, సహాయ అధ్యక్షుడు కేవీఎస్ఆర్ మూర్తి, సంయుక్త కార్యదర్శి ఎం. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 150 కాలనీల్లో ఇంకుడు గుంతల ఏర్పాటుకు సంకల్పించారు. తొలి విడతగా సింహాచలం, కూర్మన్నపాలెం, కిర్లంపూడి, ఎంవీపీ, మధురవాడ, తిరుమలనగర్, అడవివరం, మద్రిపాలెం, వుడా లేఅవుట్ తదితర ప్రాంతాల్లో 60కి పైగా గుంతలు తవ్వారు.


జేఆర్ నగర్ కాలనీలో..

జీవీఎంసీ సహకరిస్తే..

ప్రతి ఇంట్లోనూ పూర్తిస్థాయిలో ఇంకుడు గుంతలుండాలి. దాతల సహకారం అందిస్తామని చెప్పినా పలు కాలనీల్లో ముందుకు రాలేదు. జీవీఎంసీ సహకారం అందిస్తే పార్కులు, ఖాళీ స్థలాల్లో గుంతల నిర్మాణానికి సలహాలు, సూచనలు అందిస్తాం.

– కేవీఎస్ఆర్ మూర్తి, సహాయ అధ్యక్షుడు, ఏపీ ఫెర్వాస్

జీవీఎంసీ పరిధిలో కాలనీలు: 20,000 (సుమారు)

ఇంకుడు గుంతలున్నవి: 30%


150 ఏపీఫెర్వాస్‌లో నమోదు

గుంతలు ఏర్పాటుచేసిన కాలనీలు: 40

జీవీఎంసీ పరిధిలో జనాభా: 24 లక్షలు (సుమారు)

2051 నాటికి జనాభా (అంచనా): 50 లక్షలు (సుమారు)

రోజుకు తాగునీటి అవసరాలు: 180 ఎంజీడీ



దేశంలో 2030 నాటికి 40 శాతం ప్రజలకు తాగునీరు అందదని నీతి ఆయోగ్ పేర్కొంది. వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో మూడేళ్లకోసారి నీటి కొరత తీవ్రమవుతోంది. ఏటా వేసవిలో జీవీఎంసీ ట్యాంకర్లతో నీటి సరఫరాకు రూ. 4 నుంచి రూ. 5 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి రూ. 12 వేలు ఖర్చవుతుంది. విశాఖలో ఏడాదికి సాధారణంగా 1000 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. ఇంకుడు గుంతలు నిర్మించి వర్షపు నీటిని ఒడిసిపడితే భూగర్భ జలాలు పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.

ఒక్కో నిర్మాణానికి రూ.12 వేలు

శతాధిక వృద్ధురాలి మృతి



దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు వరదపురెడ్డి చెల్లయ్యమ్మ (101) శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. నాలుగు తరాలను చూసిన ఈమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భర్త ముత్యాలనాయుడు గతంలోనే చనిపోయారు. కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమారుడు అప్పలనాయుడు, అల్లుడు అబద్దం ఉపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. చెల్లయ్యమ్మ అంత్యక్రియలు ఆదివారం దేవరాపల్లిలో జరిగాయి.


నాటికలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

మంచి నాటకానికి ప్రజాదరణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: మంచి నాటికకు ఎప్పుడూ ప్రజాదరణ ఉంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. దసరా ఉత్సవాల్లో భాగంగా కర్రి రమేశ్ జ్ఞాపకార్థం అనకాపల్లిలో ఆదివారం నాటి ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలను ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ నాటికలను ఆదరించాలన్నారు. వచ్చిన జనం చూస్తుంటే తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ ఉత్సవ కమిటీ ఛైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, కర్రి సన్యాసినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన స్వప్నం దాల్చిన అమృతం, మూల్యం నాటికలు ఆకట్టుకున్నాయి.

ద్విచక్రవాహనం బోల్తా పడి ఒకరి మృతి

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం శివారులోని డైవర్షన్ కల్వర్టు వద్ద ద్విచక్ర వాహనం బోల్తా ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై డి. భూషణం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డతీగల నుంచి రంపచోడవరం శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కారం త్రిమూర్తులుదొర(38) అతివేగంతో గంగవరం శివారులో కల్వర్టు వద్ద అదుపుచేయలేక బోల్తా పడ్డాడు. తలకు బలమైన గాయమై సంఘటన స్థలంలో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భూషణం తెలిపారు.

స్నేహపూర్వక పోలీసింగ్‌కు సహకారం

గంగవరం, న్యూస్‌టుడే: ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు, సమాజంలో సామరస్యాన్ని పెంపొందించేందుకు మండల పాస్టర్ల సంఘం తరపున పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని మండల పాస్టర్ల సంఘం అధ్యక్షుడు బి. సంతోష్, సభ్యులు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై డి. భూషణంను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో పలు సమస్యలపై మాట్లాడారు. ఆయనను సన్మానించి మొక్క అందించారు. సభ్యులు మడకం బాబురావు, జి. ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సందడే సందడి

చింతపల్లి, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: మన్యంలోని పలుప్రాంతాల్లో ఆదివారం పర్యటకుల సందడి నెలకొంది. ఆంధ్రాకశ్మీర్ లంబసింగితోపాటు తాజంగి, చెరువులవెనం ప్రాంతాలకు దూరప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. ఇక్కడ ప్రకృతి, మంచు అందాలను ఆస్వాదించారు. ఈ ప్రాంతాలన్నీ సందర్శకులతో కళకళలాడాయి. డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలవిహారి, అంజోడ సిల్క్‌ఫాం, కొల్లాపుట్టు జలతరంగిణి ప్రాంతాలకు పర్యటకులు పోటెత్తారు. కొల్లాపుట్టు, చాపరాయి జలవిహారిలో స్నానాలు చేస్తూ సరదాగా గడిపారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న పూల తోటల్లో సెల్ఫీలు తీసుకున్నారు.


చాపరాయి జలవిహారిలో పర్యటకులు


చెరువులవెనంలో..

పర్యటక కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పర్యటక ప్రదేశాలు తాజంగి, లంబసింగిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఏపీ పర్యటకాభివృద్ధి సంస్థ సభ్యుడు కిల్లో రమేష్‌నాయుడు అన్నారు. ఆదివారం తాజంగి, లంబసింగిలో ఆయన పర్యటించారు. పర్యటక ప్రదేశాల్లో అందుబాటులోనున్న సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, సమస్యలు తదితర విషయాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్మికులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం

ఏడుగురు ప్రయాణికులకు గాయాలు

అనకాపల్లి పట్టణం, కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట మండలం బయ్యవరం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందగా ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. దీనికి సంబంధించి కశింకోట సీఐ స్వామినాయుడు కథనం ప్రకారం.. నరసాపురం నుంచి సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు 33 మంది ప్రయాణికులతో ఆదివారం రాత్రి 8.45 గంటలకు విశాఖపట్నం బయల్దేరింది. బయ్యవరం జాతీయ రహదారి వద్ద లారీ యూటర్న్ అవుతుండగా దీని వెనక ఆగి ఉన్న మరో లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం ఇలపకుర్రు గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ గుత్తిలి జగన్మోహనరావు (50) మృతి చెందారు. ఆయనతోపాటు ఏడుగురు ప్రయాణికులకు గాయాలవగా వీరికి అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందించారు. వీరిలో ఒక మహిళ కాలికి బలమైన గాయమైంది. ఈమెను బంధువుల చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామినాయుడు తెలిపారు. ప్రమాద సమాచారం తెలిసిన నరసాపురం డిపో సహాయ మేనేజర్ టి. ధనలక్ష్మి, ఉద్యోగ సంఘ నాయకులు అనకాపల్లికి బయలుదేరి వచ్చారు. శవపంచనామా అనంతరం డ్రైవర్ మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి తీసుకెళ్లారు. డ్రైవర్ జగన్మోహనరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ జగన్మోహనరావు (పాతచిత్రం)

పాదచారులకు ఇబ్బందులు కలిగించొద్దు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై సామగ్రి పెట్టి పాదచారులకు ఇబ్బందులు కలిగించొద్దని ఎమ్మెల్యే మత్స్యలింగం అన్నారు. అరకులోయ ప్రధాన రహదారి, మార్కెట్ ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. స్థానిక వాలీబాల్ మైదానంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం మసీదు రోడ్డు, ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపారులతో మాట్లాడారు. పాదచారుల నడిచే దారిలో వ్యాపారులు సామగ్రి పెట్టడంతో రోడ్లపై ప్రజలు నడిచివెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం


గంజాయి నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న అడ్డతీగల సీఐ నరసింహమూర్తి

గంజాయి రవాణా నేరం

అడ్డతీగల, న్యూస్‌టుడే: గంజాయి రవాణా, సారా తయారీ వంటి అసాంఘిక కార్యక్రమాలు చట్టరీత్యా నేరమని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి పేర్కొన్నారు. భీముడుపాకలులో ఆదివారం గ్రామస్థులకు సారా, గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కేసుల్లో చిక్కుకుని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. ఎస్సై వినోద్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 210 మందికి సేవలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: మండలంలోని సిరిగిందలపాడులో ఆదివారం రామకృష్ణమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 210 మందికి వైద్యసేవలు అందించారు. శిబిరంలో వైద్యులు టి.వి సుబ్బారావు, దాసరి ఉమామహేష్ తదితరులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరానికి వచ్చిన రోగులతోపాటు వెంట వచ్చిన వారికి ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహరాజ్, క్యాంపు కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాసు, వాలంటీర్లు దాసరి అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

సంగారెడ్డి, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం శివారులో ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. అనకాపల్లికి చెందిన వీర్రాజు కుటుంబ సభ్యులతో 20 ఏళ్లుగా గడ్డపోతారంలో నివసిస్తూ.. స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి గడ్డపోతారం శివారు నుంచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వీర్రాజుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అట్టల లోడు లారీ దగ్ధం

నాతవరం, న్యూస్‌టుడే: తాండవ కూడలిలో ఆదివారం ఓ లారీ అగ్నికి ఆహుతైంది. పాత పేపర్లు, అట్టల లోడుతో వెళ్తున్న లారీని డ్రైవరు రోడ్డు పక్కన ఆపి బయటకు వెళ్లారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ మంటలు అంటుకుని లారీ దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. లారీ నర్సీపట్నంకు చెందినదని తెలిసింది.


తాండవ కూడలిలో దగ్ధమవుతున్న లారీ

ఇసుక అక్రమ రవాణా..

రెండు ట్రాక్టర్లు సీజ్

రావికమతం, న్యూస్‌టుడే: ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. వి.మాడుగుల మండలం జమ్మాదేవిపేటకు చెందిన రెండు ట్రాక్టర్లలో కొత్తకోటకు ఇసుక తరలిస్తుండగా ఆదివారం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాసరావు చెప్పారు. దొండపూడి అటవీ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా ఇసుక లోడుతో వచ్చిన ట్రాక్టర్లను పోలీసులు ఆపారు. రవాణాకు అనుమతి పత్రాలు డ్రైవర్ల వద్ద లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 10 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై చెప్పారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్‌డ్	199	230
స్కిన్‌లెస్	226	240

కొట్టుకుపోయిన కల్వర్టులు..
రాకపోకలకు ఇబ్బందులు

రంపచోడవరం, మారేడుమిల్లి, న్యూస్‌టుడే:

ఇటీవల కురిసిన వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలో పలుచోట్ల కొండవాగులపై కల్వర్టులు కొట్టుకుపోయాయి. దీంతో రాకపోకలు స్తంభించి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



తాడేపల్లి-మద్దివీడు వెళ్లే రహదారిలో కొట్టుకుపోయిన కల్వర్టు వద్ద గిరిజనులు

మారేడుమిల్లి మండలంలో లోతట్టు ప్రాంతమైన తాడేపల్లి పంచాయతీ తాడేపల్లి నుంచి మద్దివీడు గ్రామానికి వెళ్లే రహదారిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రెండు కల్వర్టులు కొట్టుకుపోయాయి. దీంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యానికి గురైనా ఆసుపత్రికి సైతం కాలినడకన వెళ్లాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణులను ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్సులు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతోపాటు రేషన్‌కార్డు లబ్ధిదారులకు నిత్యావసర సరకులు సరఫరా చేసేందుకు ఎండీఎం వాహనాలు రెండు కిలోమీటర్ల దూరంలోనే నిలిపివేస్తుండటంతో అక్కడి నుంచి కాలినడకన సరకులు తెచ్చుకొంటూ ఇబ్బందులు పడుతున్నామని మద్దివీడు గ్రామగిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టులకు మరమ్మతులు చేయడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఇక్కడి గిరిజనులు శనివారం ఆందోళనకు సైతం దిగారు.

అధికారులకు చెప్పినా:

మద్దివీడు వెళ్లే ప్రధాన రహదారిలో కొండవాగులపై ఉన్న రెండు కల్వర్టులు కొట్టుకుపోయాయి. వీటికి మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బందులు పడకుండా చూడాలని ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినప్పటికి సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టులకు మరమ్మతులు చేయించి గిరిజనుల కష్టాలను తీర్చాలి.

– అందాల సోమిరెడ్డి, సర్పంచి, తాడేపల్లి

నిధులు వృథా.. తప్పని వ్యథ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: బూసీపుట్టు పంచాయతీ కమ్మరిగొయ్యి గ్రామంలో నిర్మించిన నీటి పథకం నిర్మాణం పూర్తి చేయక గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పనులకు రూ.1.78 లక్షలు ఖర్చు చేశారని, ట్యాంకు అమర్చి గ్రామంలో నీటిని సరఫరా చేయకుండా వదిలేశారని గ్రామస్థులు సింహాచలం, వేణుగోపాల్ చెప్పారు. పనులు పూర్తి చేసి రక్షిత నీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అసంపూర్తి నీటి పథకాన్ని చూపుతున్న గిరిజనులు

ఇదేనా 'స్వచ్ఛ సంకల్పం'

దర్పణం



పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నా దానిని అమలు చేయడంలో కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గ్రామాల్లో చెత్తను సేకరించడానికి గతంలో మూడుచక్రాల రిక్షాలు పంపిణీ చేశారు. వీటితో డంపింగ్ యార్డులకు వ్యర్థాలు తరలించాలి. ఈ రిక్షాలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో చెత్త సేకరణ సాధ్యం కావడం లేదు. ముంచంగిపుట్టు నుంచి రూఢకోట మార్గంలో తుప్పల చాటున స్వచ్ఛ సంకల్పం రిక్షాను నిరుపయోగంగా వదిలేశారు. పంచాయతీ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని పలువురు కోరుతున్నారు. – పెదబయలు, న్యూస్‌టుడే

అ వీ ఇ వీ

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: అరకులోయకు చెందిన శ్రీనివాసరావు ఆదివారం పాడేరు వైపునకు ద్విచక్రవాహనంపై వస్తూ మార్గమధ్యలో అంత్రిగుడ మలుపులో డివైడర్‌ను ఢీకొన్నారు. తీవ్రగాయాలతో రక్తపు మడుగులో ఉన్న ఆయన్ను స్థానికులు ఆటోలో డుంబ్రిగుడ పీహెచ్‌సీకి తరలించారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

గ్రామం మధ్యలో గోవుల వధ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ మధ్యల్లో గోవులను చంపి వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారని, వెంటనే దీన్ని నిలిపేయాలని చింతపల్లి గ్రామస్థులు సోమ చిన్న, రామలక్ష్మి కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. స్థానిక అంబేడ్కర్ కాలనీ ఇళ్ల మధ్యలో పశువులను చంపి, వ్యర్థాలను అక్కడే వదిలేస్తున్నారన్నారు. కుళాయి పక్కనే ఉండటంతో దుర్వాసన వస్తోందన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశామని చెప్పారు.

నిత్యావసర సరకుల పంపిణీ

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని నెల్లిపాకలో వరద బాధితులకు గూంజ్-ఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు ఆదివారం పంపిణీ చేశారు. సర్పంచి కొర్సా భద్రమ్మ, తెదేపా మండల అధ్యక్షుడు పుట్టి రమేష్‌బాబు స్థానిక ఎస్సీ కాలనీలో సుమారు 150 కుటుంబాలకు వీటిని అందజేశారు. అంతకు ముందు ఎస్సీ కాలనీలోని డ్రైనేజీలో, వీధులలో ఉన్న చెత్త తొలగించేందుకు ప్రజలంతా స్వచ్ఛభారత్ నిర్వహించారు. తెదేపా సీనియర్ నాయకులు ఏలూరి వెంకన్న, ఏఎస్‌డీఎస్ కో ఆర్డినేటర్ ఎస్.రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.



సరకులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

వృద్ధులకు వితరణ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: లకవకరపుపేట పంచాయతీ ఎర్రచెరువుల గ్రామానికి చెందిన రైతు బూసరి బోడేశ్వరరావు పంటల సాగు ద్వారా వచ్చే ఆదాయంలో కొంత పేదలకు ఖర్చు చేస్తున్నారు. ఆదివారం మారుమూల గ్రామం సాగులులో వృద్ధులకు రగ్గులు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. గిరిజనులు ఆనంద్, బుజ్జిబాబు, సత్యనారాయణ, దారబాబు పాల్గొన్నారు.

జన్‌మన్‌తో పీవీటీజీలందరికీ ఇళ్లు

చింతపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీ గిరిజనులందరికీ సొంతిళ్లు సమకూరుతున్నాయని కిటుముల పంచాయతీ సర్పంచి రమణమ్మ అన్నారు. ఆదివారం కిటుముల పంచాయతీ మారుమూల పొలంబంద గ్రామంలో పీఎంజన్‌మన్ పథకం ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు ఆమె భూమి పూజ చేశారు. ట్రైకార్ పూర్వ డైరెక్టర్ లోవరాజు, వార్డు సభ్యులు సుమన్, రాధాకృష్ణ, స్థానిక నాయకులు పోతురాజు, సన్యాసిరావు, అప్పారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



పొలంబందలో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న సర్పంచి తదితరులు



మోతుగూడెంలో అమ్మవారికి పూజలు



చింతపల్లి సాయినగర్ వీధిలో..



వీఆర్‌పురంలో..

లలిత త్రిపుర సుందరిగా దుర్గమ్మ

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం లక్ష్మీగణపతి దేవాలయంలో అమ్మవారు ఆదివారం లలిత త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. భవానీ మాలధారులు, మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఆర్యవైశ్యులు పవన్ కుమార్ అమ్మవారికి ప్రత్యేక అలంకరించి పూజలు నిర్వహించారు.

వరరామచంద్రపురం: వీఆర్‌పురంలో అమ్మవారిని లలితదేవిగా అలంకరించి విశేషపూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. భజన బృందాలు భక్తిగీతాలను ఆలపించారు. మహిళలు బతుకమ్మలతో సందడి చేశారు.

ఎటపాక, న్యూస్‌టుడే: శ్రీదేవీ శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా ఆదివారం నాలుగవ రోజు ఎటపాకలో దుర్గామాత లలిత త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిస్తుంది. తోటపల్లి, నెల్లిపాక, గుండాలలో రమణ, చోడవరం, ఎటపాక, నందిరామ, లక్ష్మీపురంతో పాటు పలు గ్రామాల్లో వెలసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి, దూసరపాము, వట్టిగెడ్డ, జడ్డంగి, చెరుకుంపాలెం, చికిలింత, అమీనాబాద్, బడదనాంపల్లి, శరభవరం, కొండపల్లి, లబ్బర్తి, లాగరాయి, కింద్ర తదితర గ్రామాల్లో దుర్గాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద అన్న సమారాధన చేశారు.

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలో శరన్నవ రాత్రి ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. సాయినగర్ వీధిలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. చింతపల్లిలోని రంగా సెంటర్‌తోపాటు అంతర్లలోని రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.



దూసరపాములో లలిత త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు

ఘనంగా దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మార్కెట్‌వీధిలోని నూతన దుర్గామాత ఆలయంలో కమిటీ సభ్యులు బదిరెడ్డి సూరిబాబు, వై. రమణయ్య, తిరిబిరి వెంకటేశ్వరరావు, పెద్ద రాజు, పండు ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. స్టేడియంలో వద్ద ఉన్న దుర్గమ్మ ఆలయంలో అల్లూరి సీతారామరాజు మోటారు వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్తు కాంతులతో సుందరంగా అలంకరించారు.



రంపచోడవరంలో విద్యుదీపాలంకరణ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 28 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు. పర్థాపుట్టు గ్రామ సమీపంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చనిపోయిన మిత్రులకు నివాళులు అర్పించారు. మిత్రుల్లో ఎవరికి కష్టమొచ్చినా ఆదుకోవాలని, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఉపాధ్యాయులు శ్రీనువాస మూర్తి, రాధాకృష్ణ, దామోదరం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టు పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

వికసించిన బ్రహ్మకమలాలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టులో నివాసం ఉంటున్న పిడిమి అప్పన్న ఇంటి ఆవరణలో బ్రహ్మకమలాలు వికసించాయి. ఒకే మొక్కకు నాలుగు కమలాలు పూశాయి. రాత్రివేళ వికసించిన వీటిని స్థానికులు ఆసక్తిగా చూశారు.



ప్రయాణికులకు బల్లల ఏర్పాటు

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరం బస్టాండ్ ఆవరణలో పలువురు దాతల సహకారంతో ప్రయాణికులకు బల్లలు ఏర్పాటు చేశారు. కూవనరానికి చెందిన మండా దుర్గాప్రసాదు, యాలం రామకృష్ణ, బంగారం వ్యాపారి గులివెందుల రమణ, వస్త్ర దుకాణ వ్యాపారి మావూరి అచ్చిరాజులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం, భద్రాచలం వైద్యులు మోహనరావు ఆసుపత్రి పేరున బల్లలు వితరణగా ఆర్టీసీకి అందించారు. వీటిని స్థానిక బస్టాండ్ కాపలాదారు మండా వీర్రాజు, వెంకన్న, శేఖర్, రామారావు ఏర్పాటు చేశారు.



బస్టాండ్ ఆవరణలో బల్ల ఏర్పాటు చేస్తున్న స్థానికులు

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా కో కన్వీనర్ అమర్ అన్నారు. దేవరాపల్లి, చాపగెడ్డ, ఎర్రవరం, ఆర్వీనగర్‌లలోని ఏపీఎఫ్‌డీసీ కాఫీ కార్మికుల నివాసగృహాలను ఆదివారం పరిశీలించారు. కార్మికులు నివాసం ఉంటున్న ఈ గృహాలు 50 ఏళ్ల క్రితం నిర్మించినవని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయని చెప్పారు. కొత్తవాటిని నిర్మించి ఇవ్వాలన్నారు. శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. కాఫీ పండ్ల సేకరణ రేట్లు పెంచాలన్నారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు టిషుబాబు, సీపీఐ మండల కార్యదర్శి సత్తిబాబు, కార్మిక సంఘాల నాయకులు నాగరాజు, జార్జిపడాల్, గణేష్, నానిబాబు పాల్గొన్నారు.



నివాసగృహాలు పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నేతలు

వన్య ప్రాణులను వేటాడొద్దు

కూనవరం, న్యూస్‌టుడే: వన్య ప్రాణులను వేటాడటం ఆపాలని, అవి కూడా మనలాంటి జీవులేనని ఎఫ్ఆర్వో ఎం.కరుణాకర్ అన్నారు. వన్య ప్రాణి మహోత్సవాల్లో భాగంగా ఆయన సిబ్బందితో కలిసి ఆదివారం క్రైస్తవ సోదరుల చర్చిల్లో, దేవీ నవరాత్రి ఉత్సవ పందిళ్లలో వన్య ప్రాణుల విశిష్టతలు వివరించారు. చెట్టు నుంచి ఆచారం, పుట్ట నుంచి సంప్రదాయం పుట్టిన విషయం గుర్తించాలన్నారు. సిబ్బంది అనిల్‌కుమార్, శంకర్‌రెడ్డి, శివప్రసన్నకుమార్, జంపన్నరాజు, కాంతారావు, నాగలక్ష్మి, సీతారామరాజు పాల్గొన్నారు.



టేకులబోరులో అమ్మవారి ఉత్సవ పందిరి వద్ద అటవీశాఖ అధికారుల ప్రచారం

జనసేన బలోపేతానికి కృషి

పెదబయలు, న్యూస్‌టుడే: మన్యంలో జనసేన పార్టీ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌ఛార్జి జాగరపు కొండలరావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనని ప్రజలకు వివరించాలన్నారు. ఆదివారం పెదబయలులో పార్టీ పంచాయతీల ఇన్‌ఛార్జిల నియామక ప్రక్రియ నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పార్టీ మండల అధ్యక్షులు కిల్లో బాబూరావు, ఉపాధ్యక్షులు జాగరపు పవన్, నాగరాజు, ముద్దుకృష్ణం, సెగ్గె రామారావు, మహదేవ్ పాల్గొన్నారు.



పెదబయలులో సమావేశమైన జనసైనికులు

గంజాయి నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో నిఘా

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో గంజాయి సాగు నిర్మూలనకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. డ్రోన్ కెమెరాలతో సాగు భూములను తనిఖీ చేశారు. ముంచంగిపుట్టు ఎస్సై రవీంద్ర పర్యవేక్షణలో పోలీసుల బృందం ఆదివారం వనుగుమ్మ, రంగబయలు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా వినియోగించి అటవీ, వ్యవసాయ భూములను చిత్రీకరించారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, ప్రజలు వీటికి దూరంగా ఉండాలని రంగబయలు గ్రామంలో ప్రజలకు ఎస్సై వివరించారు. ప్రతి గ్రామంలో డ్రోన్ కెమెరాతో తనిఖీలు చేపడతామని, గంజాయి సాగు చేపట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై రవీంద్ర హెచ్చరించారు.



రంగబయలులో గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్సై రవీంద్ర

ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పర్యటక కేంద్రాల్లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టామని ఎస్సై పాపినాయుడు తెలిపారు. చాపరాయి జలవిహారితోపాటు అంజోడ సిల్క్‌ఫాం పీనరీని ఆదివారం ఆయన సందర్శించారు. రోడ్డుకు ఇరువైపులా నిలిపేసిన వాహనాలను మరో చోటకు తరలించేలా చర్యలు చేపట్టారు. చాపరాయి జలవిహారి వద్ద పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలపాలని సూచించారు. జాతీయ రహదారి ఆనుకుని దుకాణాలు పెట్టుకోవద్దని సూచించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. సర్పంచి వెంకటరావు, ఉప సర్పంచి జగ్గునాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పర్యటకులతో మాట్లాడుతున్న ఎస్సై పాపినాయుడు

మొదటి యూనిట్ వినియోగంలోకి తెచ్చేలా చర్యలు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు జలవిద్యుత్కేంద్రంలో మొదటి యూనిట్ మరమ్మతులను ఏపీ జెన్‌కో ముఖ్య ఇంజినీరు వాసుదేవరావు ఆదివారం పరిశీలించారు. పనుల పురోగతిని ఈఈ రాజేంద్రప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత తొందరగా యూనిట్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పనులు చేపడుతున్న ఇంజినీరింగ్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం జలవిద్యుత్కేంద్రం కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, ఇంజినీర్లు, సిబ్బందితో సీఈ సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈలు భాస్కరరావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



యూనిట్ల పనితీరు తెలుసుకుంటున్న సీఈ వాసుదేవరావు

ఇంజినీరుకు సత్కారం

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు జలవిద్యుత్కేంద్రంలో సహాయ ఇంజినీరుగా పనిచేసి ఉప కార్యనిర్వాహక ఇంజినీర్‌గా పదోన్నతిపై విజయవాడ వెళ్తున్న ప్రసాద్‌ను ఆదివారం సిబ్బంది సత్కరించారు. ఈఈ రాజేంద్రప్రసాద్, ఇంజినీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పర్యటక కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి కందుల దుర్గేశ్‌కు జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు వినతిపత్రం అందజేశారు. అనంతగిరి మండల పర్యటనలో ఆయన్ను కలిశారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ఆప్కాస్‌లో ఉన్న 129 మంది కార్మికులకు వేతనాలు పెంచాలని పేర్కొన్నారు. రోజువారీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సీఐటీయూ కార్యదర్శి కిల్లో మోస్యా తదితరులు పాల్గొన్నారు.

● బొర్రాగుహల వద్ద పర్యటక కార్మికుల జీతాలు పెంచాలని కోరుతూ సంఘ నాయకులు రాజు ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: మన్యంలోని పర్యటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరుతూ పర్యటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్‌కు వినతిపత్రం అందించామని జనసేన మండల అధ్యక్షుడు దన్నేశ్వరరావు తెలిపారు. ఆదివారం అనంతగిరి మండలంలో పర్యటించిన ఆయన్ను కూటమి నాయకులు కలిసి సత్కరించారు. అరకులోయ అందాలను పర్యటకులు మరింతగా ఆస్వాదించేలా చర్యలు చేపట్టాలని, జలపాతాలను అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



మంత్రికి వినతిపత్రమిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

కలెక్టర్ ఆదేశాలపై కార్యదర్శి బదిలీ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలంలో ఇటీవల పర్యటించిన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఫ్రైడే డ్రైడే నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి పరమేశ్వరిని తక్షణమే బదిలీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఫోన్లో ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఆమెను రంపచోడవరం మండలం బి.వెలమలకోట బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులను ఇచ్చారు. పుల్లంగి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ను మారేడుమిల్లి బదిలీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే:

?: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి యశోదమ్మవీధికి వెళ్లే రహదారిలో వర్షపునీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వర్షపునీటిని మళ్లించి ఇబ్బందులను తొలగించాలి. – శివకుమార్, రంపచోడవరం

✓: జూనియర్ కళాశాల నుంచి యశోదమ్మవీధికి వెళ్లే దారిలో నిలిచిపోతున్న వర్షపునీటిని మళ్లించి ఇబ్బందులు తొలగిస్తాం. – రమేష్, పంచాయతీ కార్యదర్శి, రంపచోడవరం

పెదబయలు, న్యూస్‌టుడే

?: అడుగులపుట్టు పంచాయతీ తమరాడ వద్ద ప్రధాన రహదారికి పక్కన గోతులు పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – జీవన్‌బాబు, తమరాడ

✓: గోతులు పూడ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదలైతే పనులు చేయిస్తాం. – వెంకటరావు, సహాయక ఇంజినీర్, ఆర్‌అండ్‌బీ, పాడేరు



భాజపా సభ్యత్వ నమోదు వేగవంతం

కొయ్యూరు, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నేత మధుకర్ సూచించారు. ఆదివారం మండలంలోని భాజపా నేతలతో కొయ్యూరులో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లాలో సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూడా కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, మండల అధ్యక్షుడు అప్పలరాజు, గిరిజనమోర్చా జిల్లా అధ్యక్షుడు ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుకర్, నేతలు

గిరిజన అర్చకులకు శిక్షణ

గూడెంకొత్తవీధి: గిరిజన అర్చకులకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విశ్వహిందూ పరిషత్, ఆదివాసీ అర్చక సంఘం మండల అధ్యక్షుడు గబులంగి చిన్నబ్బాయి సూచించారు. పెదవలస బోడేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు లోత శివయ్య ఆధ్వర్యంలో ఆదివారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.



శిక్షణ ఇస్తున్న ప్రధాన అర్చకులు

కేంద్ర సాయం పెంచాలి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద పీవీటీజీ గిరిజనులు ఇళ్లు నిర్మించుకునేందుకు మంజూరు చేస్తున్న నిధులను రూ.2.39 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం బంగారుమెట్ట పంచాయతీలోని మాలగుమ్మిలో సీపీఎం మండల మహాసభ నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో జీఓ నంబరు 3 అమలు చేయాలని, ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు నర్శయ్య, త్రినాథ్, లైకోన్, శ్రీను పాల్గొన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: డౌనూరు, మూలపేట, గదబపాలెం, చిట్టెంపాడు పంచాయతీలను కలిపి మండలం ఏర్పాటు చేయాలని, లేకుంటే చింతపల్లి మండలంలో విలీనం చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం కుమ్మర్లలో సీపీఎం శాఖ మహాసభ నిర్వహించారు. మండల కమిటీ సభ్యుడు సానా ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని గిరిజనులంతా చేతులెత్తి ఆమోదించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ.. ఈ నాలుగు పంచాయతీల్లోని 27 గ్రామాల్లో పదివేల వరకు జనాభా ఉన్నారన్నారు. వీరంతా నర్సీపట్నం, గొలుగొండ మండలాలను దాటుకొని సుమారు 80 కిలోమీటర్ల దూరంలోనున్న కొయ్యూరు మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం దృష్టి సారించి డౌనూరు కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఎం నేతలు అప్పలనాయుడు, సత్తిబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



కుమ్మర్లలో తీర్మానాన్ని ఆమోదిస్తున్న గిరిజనులు